

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

ఫ్రీగా వస్తే పెట్రోలు అయినా..



కార్వేటినగరంలోని పెట్రోలు బంకు వద్ద ఇలా..

కార్వేటినగరం, చిత్తూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెట్రోలు కొరత కాదు. రేటూ అమాంతం పెరగలేదు. అయినా అక్కడ జనం పెట్రోలు కోసం పోటెత్తారు. ఇందుకు కారణం అక్కడ బైక్‌లకు పెట్రోలు ఉచితంగా పట్టడమే. ఉచితంగా పెట్రోలా.. చలో అని మీరూ రయ్ మంటూ దూసుకుపోతారేమో.. పెట్రోలు పట్టించుకుంటే, ఆ తర్వాత వైసీపీ బైక్ ర్యాలీలో జెండాలు పట్టుకుని తిరగాలి. ఇదంతా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో కొద్ది రోజులుగా సాగుతున్న పరిస్థితి. సిద్ధంకి సన్నద్ధం చేస్తూ వైసీపీ నాయకులు బైక్ ర్యాలీలకు పిలుపు ఇస్తున్నారు. ఆశించినంతగా జనం రాకపోవడంతో పెట్రోలు ఉచితం పథకం ప్రకటించారు. ఇంకేం జనం బైకులతో ఎగబడ్డారు. కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో శనివారం వైసీపీ జెండాలు కట్టుకున్న బైకులతో పెట్రోలు బంకులు కిటకిటలాడాయి. కార్వేటినగరంలో బైక్‌కి రూ.200 పెట్రోల్ ఫ్రీగా పోశారు. ఈ ఊళ్లోని రెండు పెట్రోల్ బంకులు 500 మందికి పెట్రోలు నింపాయి. అలాగే పెనుమూరులో రూ.150 చొప్పున పెట్రోల్ పట్టించారు. 300 మంది లక్కీ ఛాన్స్ కొట్టేశారు. ఎస్ఆర్‌పురం మండలంలో రూ.వంద చొప్పున 400 మందికి పెట్రోల్ పట్టించారు. ఈ నెల 13న పాలసముద్రం మండలంలో 160 బైక్స్‌కు రూ.200 పెట్రోల్ పట్టించారు. పెట్రోలుతోపాటూ ర్యాలీ ముగిసే చోట కార్యకర్తలకు బిరియాని అందిస్తున్నారు.

ఇదేంది జగనయ్యా?



- రాప్తాడులో వైసీపీ సిద్ధం సభకు జిల్లా నుంచి 470 బస్సులు
- ఆదివారం కూడా ప్రయాణికులకు తిప్పలే..

సీఎం సభ అంటేనే ప్రైవేటు బస్సుల, ప్రైవేటు పాఠశాలల యజమానులు హడలెత్తిపోతున్నారు. రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగి మరీ ఆయా బస్సుల్ని బలవంతంగా తీసేసుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులైతే జీ హుజూర్ అంటూ బస్సులన్నీ సభకే మళ్లించి.. ప్రయాణికుల్ని ఇబ్బంది పెట్టడం అలవాటుగా మారింది.



పలమనేరు బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



కల్లూరులో ఆటోను ఆశ్రయించిన ప్రయాణికులు

చిత్తూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో వైసీపీ సభ ఆదివారం ఉందని, జనాల్ని తరలించేందుకు శనివారమే రవాణా శాఖ అధికారులు ప్రైవేటు బస్సుల్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆర్టీసీ అధికారులూ శనివారం నుంచే బస్సుల్ని తిప్పలేదు. ఈ సమస్య ఆదివారం కూడా కొనసాగనుంది.

గంటల తరబడి ప్రయాణికుల అవస్థలు

ఆర్టీసీ బస్సుల్లో ఎక్కువ శాతం అనంతపురం జిల్లాకు తరలించడంతో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం బస్టాండులన్నీ ఖాళీగా కనిపించాయి. ఈ బస్టాండుల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. జిల్లా కేంద్రం చిత్తూరు నుంచి దూరప్రాంతాలకు బస్సులేకపోవడం అటుంచితే, పక్కనే ఉన్న గుడిపాలకు వెళ్లేందుకూ లేవు. పోనీ ప్రైవేటు బస్సుల్లో వెళ్దామంటే, వాటిని కూడా అనంతపురానికే తీసుకెళ్లారు. కొందరు ప్రయాణం రద్దు చేసుకుంటే, మరికొందరు ఆటోలు, లగేజీ వాహనాల్లో ప్రయాణం చేశారు. మన జిల్లాలో జరిగే సీఎం కార్యక్రమానికి తీసుకెళ్లినా అర్థముంది.. వేరే జిల్లాలో జరిగే సభకు ఇక్కడి నుంచి బస్సుల్ని తీసుకెళ్లడం దారుణమని ప్రయాణికులు తిట్టిపోశారు. ఇదిలా ఉండగా, సీఎం సభను ముగించుకుని బస్సులు వచ్చేసరికి ఆదివారం రాత్రి అవుతుంది. దీం తో ఆదివారం కూడా జిల్లాలో ఆర్టీసీ బస్సుల కొరత ఉంటుంది.

70 శాతం ఆర్టీసీ బస్సులన్నీ అనంతపురానికే

జిల్లాలో చిత్తూరు-1, చిత్తూరు-2, పలమనేరు, పుంగనూరు, కుప్పం డిపోల పరిధిలో 390 బస్సులున్నాయి. వీటిలో 70 శాతం అంటే 270 ఆర్టీసీ బస్సుల్ని అనంతపురం సీఎం సభకు కేటాయించారు. చిత్తూరు-1 నుంచి 52, చిత్తూరు-2 నుంచి 63, పలమనేరు నుంచి 42, పుంగనూరు నుంచి 63, కుప్పం నుంచి 50 బస్సుల్ని అనంతపురానికి పంపించేందుకు వైసీపీ నాయకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బస్సులన్నీ శనివారం నుంచే జిల్లాలో తిరగలేదు.

ప్రైవేటు పాఠశాలలకు సెలవు

జిల్లా కేంద్రం చిత్తూరులోని అన్ని ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులన్నీ అనంతపురానికి బలవంతంగా తీసుకెళ్లారు. దీంతో కొన్ని పాఠశాలలు శనివారం మధ్యాహ్నం వరకు, చాలా పాఠశాలలు రోజంతా స్కూళ్లకు సెలవు ప్రకటించాల్సి వచ్చింది.

బాబోయ్.. సీఎం వస్తున్నాడు!



రోడ్డు పక్కనున్న వృక్షాలను నరికి పేర్చిన దుంగలు

కుప్పం, ఫిబ్రవరి 17: సీఎం జగన్‌రెడ్డి వస్తున్నాడంటే చెట్టూచేమా వణికిపోతున్నాయి. భద్రత పేరుతో కిలోమీటర్ల మేరా వృక్షాలను నరికి పోగులు పెట్టడం ఆనవాయితీగా మారింది. ఈనెల 26న కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలంలో మఠం వద్ద సభకు రెండు రోజులుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా చెట్లకు మూడింది. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పది ఎకరాల రైతుల భూముల్లో సభ జరగనుంది. ప్రైవేటు స్థలంలోని యూకలిప్టస్ తోటలు, ఇతర వృక్షాలను నేలకూలుస్తున్నారు. అయిదు పొక్లెయినర్లు రాత్రీ పగలూ హోరుమంటూ పనిచేస్తున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా దశాబ్దాల నాటి భారీ యూకలిప్టస్ వృక్షాలు, ఇతర వృక్షాలు ఉన్నాయి. ఇవి కూడా నేలకూలుతున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం గుండిశెట్టిపల్లెనుంచి బడుగుబాకులపల్లె దాకా సుమారు నాలుగైదు చోట్ల స్థలాలను కేటాయించి చదును చేస్తున్నారు. ఈ క్రమంలో కూడా జాతీయ రహదారికి ఇరువైపులా గల భారీ వృక్షాలు చాలా వరకు కూలుతున్నాయి. రహదారి పొడవునా అర్ధకిలోమీటరు పరిధిలో సాగుతున్న ఈ వృక్ష విధ్వంసం చూసి స్థానికులు ఆవేదన చెందుతున్నారు. 'కూల్చడానికి ఒక్కపూట చాలు.. పెంచడానికి ఎన్నేళ్లు కావాలయ్యా' అని అంటున్నారు.



సభా స్థలాన్ని పొక్లెయినర్‌తో చదును చేస్తున్న దృశ్యం

'ప్రైవేటు' బస్సుల కోసం రవాణా శాఖ ఒత్తిడి



చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17: జిల్లా రవాణా శాఖ అధికారులు ఇప్పటికే రెండుసార్లు జిల్లాలోని ప్రైవేటు బస్సుల, ప్రైవేటు స్కూళ్ల యజమానులతో సమావేశమయ్యారు. అనంతపురం సభకు వెళ్లి వచ్చేందుకు సుమారు 600 కిలోమీటర్ల దూరం అవుతుందని ఆయా యజమానులు బస్సుల్ని పంపేందుకు నిరాకరించారు. ఇబ్బందులు పడతారని అధికారులు బెదిరించడంతో చేసేదేమీలేక వారు బస్సుల్ని పంపించారు. 150ప్రైవేటు పాఠశాలల బస్సులు, 50 ప్రైవేటు బస్సుల్ని శనివారం సాయంత్రంలోపు రవాణా శాఖ కార్యాలయానికి చేరవేశారు.



రవాణా శాఖ కార్యాలయానికి చేర్చిన 'ప్రైవేటు' బస్సులు

బొమ్మపడింది



చిత్తూరులోని రాఘవ థియేటర్ వద్ద టీడీపీ నాయకుల నినాదాలు

- 'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్
- న్యాయమే గెలిచిందన్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17: రాజధాని ఫైల్స్ సినిమాను ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేసుకునేందుకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఈ సినిమాను శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిత్తూరు నగరంలోని రాఘవ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న ఈ సినిమాను టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి చూశారు. ముందుగా థియేటర్ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చివరకు న్యాయమే గెలిచిందని చెప్పారు. ప్రజలంతా ఈ సినిమాను చూసి..రాజధాని రైతుల కష్టాన్ని, వారికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దొరబాబు, సురేంద్రకుమార్, చంద్రప్రకాష్,గురుజాల జగన్ మెహన్,పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలవ్యాను ముసుగులో కర్ణాటక మద్యం అక్రమ రవాణా

రూ.2.90 లక్షల మద్యం, వాహనం స్వాధీనం

ముగ్గురి అరెస్టు



పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు, పాలవ్యానును మీడియాకు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17: పాలవ్యాను ముసుగులో కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు కేటుగాళ్లను ఎస్ఈబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఎస్ఈబీ ఈఎస్ శ్రీధర్ రావు చిత్తూరు అర్బన్ స్టేషన్‌లో శనివారం మీడియాకు వివరాలు తెలిపారు. శనివారం ఉదయం సీఐ విజయకుమార్, ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరు శివారులోని (బెంగళూరు తిరుపతి రోడ్డు) ఇరువారం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పలమనేరునుంచి చిత్తూరు వైపు ద్విచక్రవాహనంలో వస్తున్న ఇద్దరు వ్యక్తులను అనుమానంతో తనిఖీ చేశారు. ద్విచక్రవాహనంలో తెల్లని గుడ్డలో చుట్టిన రెండు కర్ణాటక మద్యం బాక్సులను గుర్తించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వెనుక వస్తున్న ఓ పాలవ్యానును కూడా ఆపారు. దాన్ని తనిఖీ చేయగా అందులో 92 కర్ణాటక మద్యం బాక్సులు బయటపడ్డాయి. దాంతో వాహనంసహా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.2.90 లక్షలుగా, వాహనం విలువ సుమారు రూ. 4.60 లక్షలుగా తేల్చారు. పట్టుబడినవారిలో చిత్తూరు నగరంలోని రంగాచారివీధికి చెందిన ఎ.విశ్వనాథ్, సంతపేట తంగవేలు కాలనీకి చెందిన ఎస్.దేవ, గంగాధరనెల్లూరు మండలం ఎల్లమరాజుపల్లెకు చెందిన ఎస్.రాజేష్ ఉన్నారు. అక్రమ రవాణా వెనుక ఎవరెవరున్నారనే విషయమై దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు కూడా సారా, గంజాయితోపాటు మద్యం అక్రమరవాణాపై వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. ఇలా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఏఈఎస్ రవి, సిబ్బంది జయశంకర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోగా గ్లోరియా



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17: దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్ (జడ్పీ)కి సీఈవోగా రెగ్యులర్ అధికారిని ప్రభుత్వం నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్ పి.గ్లోరియాని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయిస్తూ ఆమెకు చిత్తూరు జడ్పీ సీఈవోగా పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె ఎంపీడీవో ప్రభాకర్ రెడ్డి ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోగా వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు డిప్యూటీ సీఈవోగా, అకౌంట్స్ ఆఫీసర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయనున్నారు.

గురుకులమడుగులో 'మూతబడి'



రామకుప్పం, ఫిబ్రవరి 17: ఉపాధ్యాయుడు విధులకు డుమ్మా కొట్టడంతో రామకుప్పం మండలం వీర్నమల పంచాయతీ గురుకులమడుగులోని ప్రాథమిక పాఠశాల మూతబడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గురుకులమడుగులోని ప్రాథమిక పాఠశాలలో 40మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 20 రోజుల కిందట కూడా ఇక్కడి ఉపాధ్యాయుడు విధులకు డుమ్మా కొట్టడంతో వారం పాటు పాఠశాల మూతపడింది. అప్పుడు ఎంఈవో జిల్లా విద్యాశాఖాధికారికి నివేదించారు. దాంతో ఆ ఉపాధ్యాయుడే తిరిగి విధులకు హాజరయ్యేవాడు. రెండ్రోజుల కిందట మండల విద్యాశాఖ కార్యాలయానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆయన విధులకు డుమ్మా కొట్టారు. రెండ్రోజులుగా పాఠశాల మూతపడటంతో విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇకనైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

20నుంచి నారా భువనేశ్వరి పర్యటన

4రోజులపాటు నిజం గెలవాలి కార్యక్రమం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఈనెల 20వ తేదీనుంచి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పర్యటించనున్నారు. స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టు అయినప్పుడు ఆవేదనతో మరణించిన వారి కుటుంబాలను నిజం గెలవాలి పేరుతో ఆమె పరామర్శిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె 20వ తేదీన మధ్యాహ్నం గుడుపల్లె మండలం కొడతనపల్లె, యామగానిపల్లెల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. అన్నక్యాంటీన్, చర్చి, మసీదులను సందర్శించి ఆరోజురాత్రి కుప్పంలోని ఆర్అండ్‌బీ గెస్టహౌస్‌లో బస చేస్తారు.21వ తేదీన శాంతిపురం, రామకుప్పం మండలాల్లో అన్న క్యాంటీన్లను పరిశీలిస్తారు. భోజనానంతరం పెద్దపంజాణి, పుంగనూరు మండలాల్లోని బాధిత కుటుంబాల్ని పరామర్శిస్తారు. ఆ రోజు రాత్రి మదనపల్లెలో బస చేస్తారు.22వ తేదీన పుంగనూరు, పులిచెర్ల, పూతలపట్టు, చిత్తూరు మున్సిపాలిటీ, చిత్తూరు రూరల్ ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు.ఆ రోజు చిత్తూరు నగరంలోనే బస చేస్తారు. 23వ తేదీన ఎస్ఆర్‌పురం, నారాయణవనం మండలాల్లోని బాధిత కుటుంబాలను కలుస్తారు.మధ్యలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యార్థులతో సమావేశమవుతారు.అదేరోజు మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు.

కారుణ్య నియామకాలు

- **14 మందికి పంచాయతీ కార్యదర్శులుగా పోస్టింగ్**

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17: కారుణ్య నియామకాల కింద 14 మందికి పంచాయతీ కార్యదర్శులుగా పోస్టింగ్స్ ఇస్తూ కలెక్టర్ షన్మోహన్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో ముగ్గురిని గ్రేడ్-5 కార్యదర్శులుగా, 11 మందిని గ్రేడ్-6 కార్యదర్శులుగా సమీప గ్రామ సచివాలయాలకు నియమించారు. చౌడేపల్లె మండలం అమినిగుంటకు ఎం.అర్జున్ (బురకాయలకోట), సోమల మండలం పొదలకుంట్లపల్లికి ఎస్.హరిత (కుప్పంబాదూరు), తవణంపల్లె మండలం మత్యంకు ఎస్.రోహిత్ (చిత్తూరు), పూతలపట్టు మండలం వడ్డేపల్లెకి యు.సందీప్ (బి.ఎన్. కండ్రిగ), పెనుమూరు మండలం తాటిమాకులపల్లెకు ఎ.రాజేష్ (బ్రాహ్మణపల్లె), పూతలపట్టు మండలం వేపనపల్లెకి ఎస్.ఆయేషా (రేణిగుంట), పెద్దపంజాణి మండలం తుర్లపల్లెకి పి.దుర్గామాధవి (రామసముద్రం), చిత్తూరు మండలం దిగువమాసాపల్లెకి జి.మహేంద్ర (పిళ్లారికుప్పం), పెనుమూరు మండలం కలవకుంటకు ఎ.ఎన్.గోపీనాథ్ (నెల్లూరు జిల్లా అల్లీపురం), చౌడేపల్లె మండలం అమినిగుంటకు ఆర్.లోకేష్ (మదనపల్లె మండలం), గంగవరం మండలం కీలపల్లెకి షేక్ మహమ్మద్ తయ్యూబ్ (అన్నమాచార్య జిల్లా గుర్రంకొండ), బైరెడ్డిపల్లె మండలం గొల్లచీమనపల్లెకి జి.ఆర్.బాలాజీ (బైరెడ్డిపల్లె), పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లెకి సి.భానుప్రకాష్ (అన్నమయ్య జిల్లా పీలేరు), తవణంపల్లె మండలం సరకల్లుకు ఎ.హేమసాయి (అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం)లను నియమిస్తూ ఆ ఉత్తర్వులో కలెక్టర్ పేర్కొన్నారు.

మీ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చదివించే ధైర్యముందా?

- ఎంఈవో, హెచ్ఎంలకు ఆర్జేడీ రాఘవరెడ్డి సూటి ప్రశ్న



సమావేశంలో ప్రసంగిస్తున్న రాఘవరెడ్డి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 17: 'మీ పిల్లల్ని ప్రభుత్వం బడుల్లో చదివించే ధైర్యం ఉందా' అని ఎంఈవోలు, హెచ్ఎంలను విద్యాశాఖ కడప ఆర్జేడీ రాఘవరెడ్డి సూటిగా ప్రశ్నించారు. డీఈవో దేవరాజు అధ్యక్షతన శనివారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో చిత్తూరు, రాయచోటి జిల్లాల ఎంఈవోలు, హెచ్ఎంలకు పదో తరగతి పరీక్షల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పిల్లలకు చదువు చెప్పడం సేవగా భావించాలని సూచించారు. అదే మీ పిల్లలే ప్రభుత్వ బడుల్లో ఉంటే వారి చదువులపై ప్రత్యేక దృష్టి సారించరా అని ప్రశ్నించారు. టెన్త్ క్లాస్ విద్యార్థికి కనీసం రెండో తరగతి తెలుగు పుస్తకం చదవడం రాకపోతే తప్పెవరిదో అర్థం చేసుకోవాలన్నారు. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించే టీచర్లపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉందన్నారు. సబ్జెక్టు వారీగా టీచర్ల బోధన సమయంలోని లోపాలను గుర్తించి నివేదిక తయారు చేసి, వారిని హెచ్చరించాలన్నారు. నిబద్ధతతో పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు ఆశించగలమని సూచించారు. ఇందుకోసం ఎంఈవోలు తరచూ పాఠశాలలు తనిఖీ చేయాలని చెప్పారు. అంతకుముందు చిత్తూరు డీఈవో దేవరాజు, ఏడీ విజయేంద్రరావు, చిత్తూరు, మదనపల్లె డీవైఈవో చంద్రశేఖర్, పురుషోత్తం, డీసీఈబీ కార్యదర్శి హేమారెడ్డి, పరీక్షల సహాయ కమిషనర్ చాంముండేశ్వరి, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.





షార్ సత్తా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ మరోమారు సత్తాచాటింది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి దేశ ప్రతిష్టను పెంచింది.వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం పంపిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని శనివారం సాయంత్రం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.18.46 నిమిషాల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ మూడు దశలను పూర్తి చేసుకొని ఉపగ్రహాన్ని విజయవంతంగా రోదసిలోకి చేర్చడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి.ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 వేలమందికి పైగా విచ్చేశారు. వీరిలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరందరూ ఉదయం నుంచే షార్ సమీపంలో ఉన్న సందర్శకుల గ్యాలరీకి చేరుకొన్నారు.రాకెట్ నింగికెగిరిన సమయంలో ప్రేక్షకుల కరతాళధ్వనులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.షార్ నుంచి ఇప్పటి వరకు 91 ప్రయోగాలు చేపట్టారు. తాజా ప్రయోగం 92వది కాగా జీఎస్ఎల్వీ-మార్క్ 2 ప్రయోగాల్లో 16వ ప్రయోగం కావడం విశేషం.కాగా ఈ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి శనివారం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ పూజలు చేశారు.అలాగే తిరుమల ఆలయంలో, శ్రీకాళహస్తీశ్వరాలయంలో జీఎస్ఎల్వీ- ఎఫ్14 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ ఉన్నారు.

థర్డ్ జనరేషన్ శాటిలైట్

ఇన్‌శాట్-3డీఎస్ మూడవ తరం వాతావరణ ఉపగ్రహానికి తదుపరి మిషన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఉపగ్రహంలో వాతావరణ పరిస్థితిని అంచనా వేయగల అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ ఉపగ్రహం ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల సేవలకు కొనసాగింపుగా వాతావరణ సేవలను మెరుగుపరచనుంది.


జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 77,483 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,276 మంది తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

● పదిరోజుల్లో పూర్తిగా కోలుకున్న బాధితుడు


విద్యార్థితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థికి అత్యంత సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆయన శనివారం మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్‌కుమార్ ద్వివేది స్థానిక వేదిక్ యూనివర్సిటీలో ఎంఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 6న యూనివర్సిటీ ఆవరణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని తలభాగంలోని నుదుటి ఎముకలు దెబ్బతిని, మెదడులోకి చొచ్చుకుపోయాయి. దవడ ఎముకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్విమ్స్‌కు తీసుకురావడంతో న్యూరో, ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు 4గంటలపాటు శ్రమించి అతిక్లిష్టమైన సర్జరీని అధునాతన పరిజ్ఞానంతో విజయవంతంగా పూర్తిచేశారని వివరించారు. ముఖ భాగానికి మునుపటి రూపం తీసుకురావడమేగాక పది రోజుల్లోనే కోలుకునేలా చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. టీటీడీ ప్రాణదాన పథకం ద్వారా సర్జరీని పూర్తి ఉచితంగా చేయగలిగామని తెలిపారు. సచిన్ కుమార్ ద్వివేది మాట్లాడుతూ తన ప్రాణం నిలబెట్టిన స్విమ్స్, టీటీడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, ఎంఎస్ డాక్టర్ రామ్, న్యూరోసర్జరీ, అనస్థీషియా విభాగాధిపతులు డాక్టర్ రమేష్ చంద్రా, డాక్టర్ అలోక్ సమంత్రే, డాక్టర్లు బీసీఎం ప్రసాద్, వెంకట్, చంద్రశేఖర్, ప్రవీణ్ కుమార్, నాగతేజ, డీడీలు ప్రభావతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మద్యం పేరుతో తనిఖీలకొచ్చి..
దుస్తులను ఎత్తుకెళతారా?

పోలీసులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ శ్రేణులు


కోళ్లఫారం వద్ద పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం - దుస్తుల బాక్సును ఎత్తుకెళుతున్న హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 17: 'మద్యం అక్రమంగా తీసుకొచ్చి స్టాక్ పెట్టినట్లు ఫిర్యాదు అందిందని తనిఖీలకొచ్చి.. పేదల కోసం తెచ్చిన దుస్తులను ఎత్తుకెళతారా?' అంటూ పోలీసులతో టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగాయి. స్థానికులు, టీడీపీ శ్రేణులు తెలిపిన వివరాల మేరకు.. జీడీ నెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ గంగాధరనెల్లూరు మండలం వెజ్జుపల్లె పంచాయతీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీతోపాటు మన ఇంటికి మనడాక్టర్ థామస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించాలని నిర్ణయించారు. ఆయన సొంత నిధులతో పేదల కోసం సంక్రాంతి కానుకగా దుస్తులను పంపిణీ చేయాలని శుక్రవారం రాత్రి స్టాక్ తెచ్చారు. ఈ క్రమంలో శనివారం ఉదయం సుమారు ఏడు గంటల ప్రాంతంలోనే వెజ్జుపల్లెకు పోలీసులు చేరుకున్నారు. టీడీపీకి చెందిన కొందరి ఇళ్లకు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప, కానిస్టేబుల్ ప్రభు వెళ్లారు. మద్యం స్టాక్ అక్రమంగా తెచ్చి మీ ఇళ్లలో పెట్టారని ఫిర్యాదు అందిందంటూ.. ఇళ్లలోపల చూపించాలని బెదిరిస్తూ తనిఖీలు చేశారు. అలాగే మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి కోళ్లఫారం వద్దకెళ్లారు. అక్కడున్న ఓ గదిలో మద్యం ఉందంటూ తనిఖీ చేయగా సంక్రాంతి కానుక దుస్తుల బాక్సులు కనిపించడంతో వాటిని అప్పగించాలని పట్టుబడ్డారు. దుస్తుల బాక్సులను ఇచ్చేది లేదని.. కేసుపెట్టి ఉంటే ఎఫ్ఐఆర్ కాపీని చూపించాలని మాజీ ఎంపీటీసీ, ఆయన కుమారుడు దయారెడ్డితోపాటు టీడీపీకి చెందిన నేతలు, కార్యకర్తలు సుమారు మూడు గంటలపాటు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినా దుస్తుల బాక్సులను పోలీస్ వాహనంలోకి ఎక్కించుకుని గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై సీఐ శంకర్‌ని ఫోన్‌ద్వారా వివరణకోరగా.. వెజ్జుపల్లెలో సంక్రాంతి కానుకపేరుతో దుస్తులు పంచుతున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్లను ప్రలోభపెట్టడానికి బహుమతులు ఏవీ ఇవ్వరాదని చెప్పారు. అలాగైతే వైసీపీ నేతలు పలుచోట్ల రకరకాలుగా బహుమతులు ఇస్తున్నారు కదా వాటిననీ అలాగే స్వాధీనం చేసుకున్నారా? అని అడిగితే ఆ విధంగా వైసీపీవారు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సీజ్ చేస్తామని సీఐ వివరించారు. ఇదిలా ఉంటే.. మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొని, దుస్తుల బాక్సులను కోర్టుకు అప్పగించనున్నట్లు పోలీసుల ద్వారా సమాచారం అందింది. కాగా.. ఈ అంశంపై తమ పార్టీ నేతలను పోలీసులు ఇబ్బంది పెట్టారంటూ టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ మాట్లాడిన వీడియో ఒకటి వాట్సాప్‌లో వైరల్ అవుతోంది.

ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్ల బాధ్యత కీలకం : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్ల బాధ్యతే కీలకమని జేసీ శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నోడల్ ఆఫీసర్లు, వారి సహాయక సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సోమవారం నుంచి ఎన్నికల నిర్వహణపై వరుసగా సమావేశాలు జరుగుతాయని చెప్పారు. వీటికి గైర్హాజరయ్యే అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం కార్యాలయ పనులు, మధ్యాహ్నం ఎన్నికల పనులు చేయాలన్నారు. అంతకుముందుకు తన క్యాంపు కార్యాలయం నుంచి పోలింగ్ కేంద్రాల పరిశీలన, ఎన్నికల విధులు, రేషన్ పంపిణీ, రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, బీఎల్వోలు, పంచాయతీ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో పుల్లయ్య, డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఫిట్‌మెంట్ 30 శాతం మంజూరు చేయాలి



ఎన్జీవో భవనం వద్ద నినాదాలు చేస్తున్న జేఏసీ నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించడంతో పాటు 30శాతం ఫిట్‌మెంట్‌ను మంజూరు చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్ కేవీ రాఘవులు డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలో భాగంగా శనివారం ఎన్జీవో భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించిన సరెండరు లీవు, జీపీఎస్, ఏపీజీఎల్ఐ లోన్లు, డీఏ బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలన్నారు. ఐఆర్‌కు సంబంధించిన పేరివిజన్ కమిషన్ ఇప్పటి వరకు ఎలాంటి బాధ్యత తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోమశేఖర్ నాయుడు, చెంగల్రాయమందడి, నాదముని, వీజీ రఘు, మహేష్, లక్ష్మీనారాయణ, పన్నీర్ సెల్వం, సుబ్రహ్మణ్యం, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కాగా, శనివారం జిల్లాలోని 14 పాత తాలూకా కేంద్రాల్లో ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ర్యాలీ, ధర్నా కార్యక్రమాలను నిర్వహించి తహసీల్దార్లకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో 56 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శనివారం ఉదయం 6 గంటలకు ప్రధాన కల్యాణకట్ట ముందున్న షెడ్‌లో 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి కదలిక లేకుండా ఉండటాన్ని విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద లభించిన ఓ బ్యాగులో గత నెల 3వ తేదీన వేలూరులోని ప్రభుత్వాస్పత్రిలో తీసుకున్న ఎక్స్‌రే లభించింది. అందులో శరవణన్ (56) అని మాత్రమే ఉంది. ఇతర గుర్తింపు కార్డులు, బంధువులు ఎవరు లేకపోవడంతో తిరుమల వన్‌టౌన్ పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 0877-2263654, 9440796771లకు తెలియజేయాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఒకరి అరెస్టు, మరొకరు పరారీ


పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

చిత్తూరు, ఫిబ్రవరి 17: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొచ్చిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.2.20 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం, ఓ స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. వివరాలను రెండో పట్టణ సీఐ ఉలసయ్యతో కలిసి చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి శనివారం మీడియాకు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి మద్యంతోపాటు నిషేధిత వస్తువులు రాకుండా నిఘా పెట్టారు. శనివారం పోలీసులకు వచ్చిన సమాచారంతో తేనెబండ రాజీవ్‌నగర్‌కాలనీకి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద టెలిఫోన్‌కాలనీకి చెందిన రాజా(36)ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.2.20 లక్షల విలువ చేసే మద్యం, సరఫరాకు ఉపయోగించిన మోటరు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రానున్న ఎన్నికల నిమిత్తం కర్ణాటక నుంచి తేనెబండకు చెందిన జ్యోతితో కలిసి ఈ మద్యాన్ని తీసుకొచ్చి స్టాకు పెట్టుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వాంగ్మూలాన్ని నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. జ్యోతి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న పోలీసులను ఆయన అభినందించారు.

యాత్రకు రండి...ప్లీజ్!


చంద్రగిరిలో సినిమా హాలు వద్దకు బస్సుల్లో తరలిస్తున్న జనం

'రండి బాబూ రండి, రండి తల్లీ రండి...మీ కోసం లగ్జరీ బస్సు పెట్టాం. ఇంటర్వెల్లో స్నాక్స్ కూడా ఇస్తాం. బిందాస్‌గా వచ్చి సినిమా చూసి వెళ్లండి' అంటూ చంద్రగిరి నియోజక వర్గ ప్రజల వెంట పడుతున్నారు వైసీపీ నాయకులు. జగన్ ప్రచారం కోసం తీసి విడుదల చేసిన యాత్ర-2 సినిమా థియేటర్లు వెలవెలపోతుండడంతో వాటిని నింపడానికి నానా అవస్థలూ పడుతున్నారు. శనివారం నుంచి చంద్రగిరిలో యాత్ర-2 సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు జనాన్ని తరలించే ఏర్పాట్లు ఘనంగానే మొదలు పెట్టారు. ప్రత్యేక షోలు ఏర్పాటు చేశారు. పంచాయతీకి రెండు బస్సులు చొప్పున సిద్ధం చేశారు. ఎమ్మెల్యే ఏపీఆర్వోల ద్వారా ఈ సమాచారాన్ని పంచాయతీల పరిధిలోని సచివాలయాలకు చేర్చారు. వలంటీర్ల ద్వారా ప్రేక్షకులను రాబట్టే ప్రయత్నం చేశారు. పెద్ద పంచాయతీలకు ప్రత్యేక లగ్జరీ బస్సులను పంపారు. చిన్న పంచాయతీలకు మినీ బస్సులను పంపారు. బస్సులను థియేటర్ వద్ద నిలిపి అందులోని వారిని దగ్గరుండి హాలు లోపలకు సాగనంపారు.ఇంటర్వెల్ సమయంలో సమోసా, కూల్ డ్రింక్స్ అందించారు.చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలూ కవరయ్యేలా ప్లాన్ చేశారు. మరో మూడు రోజుల పాటు యాత్ర-2 సినిమాను ఆడేలా చేయాలన్న సంకల్పంతో వైసీపీ నేతలున్నారు. ఇందులో భాగంగా శనివారం మార్నింగ్ షో చూపించాలని తొలుత భావించారు. కానీ అనుకున్నంత స్పందన లేకపోవడంతో వారిని మ్యాట్నీకి మార్చారు. తొలిరోజే స్పందన లేకపోతే మిగిలిన రోజులు ఎట్లస్వామీ అని కార్యకర్తలు, వలంటీర్లు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కళ్లకు గంతలతో జూనియర్ డాక్టర్ల నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17 : ఐదు నెలలుగా రావాల్సిన స్టైఫండ్ చెల్లించాలని కోరుతూ రుయాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. నిత్యం వైద్యుల సేవలో ఉండే తాము స్టైఫండ్‌పైనే ఆధారపడి చదువుకుంటున్నామని, అలాంటిది ఐదు నెలలుగా రాకపోవడంతో ఖర్చులకు సైతం తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ విషయమై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు సోమవారం లోపు వారికి స్టైఫండ్ చెల్లించాలని డీఎంఈను ఆదేశించారు. దీంతో జూడాలు ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

డ్రైవర్ కావలెను
బొలెరో గూడ్స్ వెహికల్‌కు డ్రైవర్ కావలెను. సెల్ నెం. వి.రమణ 94411 04444. అడ్రస్ : గంగా గణపతి స్టీల్ & సిమెంట్, అన్నమయ్య మార్గ్, గెస్ట్ లైన్ టు డిబిఆర్ రోడ్డు, నియర్ ఫిష్ మార్కు, తిరుపతి.
AJT - 6107

FLAT FOR SALE
క్షత్రియనగర్, ఓటేరు దగ్గర, వి-మార్ట్ సూపర్ బజార్ వెనుక, తిరుపతిలో ఈస్ట్ ఫేసింగ్, 1180 Sq.Ft, G+5, 100% వాస్తు గల 10 ఫ్లాట్స్ అమ్మబడును. సెల్ : 63042 68606, 96526 37699.
AJT - 6102

న్యూరోకేర్
శిరీష న్యూరో కేర్ : మెదడు, వెన్నెముక & నరముల వైద్య నిపుణులు. తలనొప్పి, మైగ్రేన్, పక్షవాతం, మూర్ఛ, ఫిట్స్, మెడనొప్పి, నడుమునొప్పి, తిమ్మిర్లు, మంటలు, నరముల సమస్య, కండరాల జబ్బులు, తల తిరగడం, మతిమరుపు, వణుకు, పార్కిన్‌సోనిజం, నిద్ర సమస్యలు, సంపూర్ణ అవగాహనతో వ్యాధి నిర్ధారణ - అధునాతన చికిత్స మా ప్రత్యేకత. డా. సి.శిరీషరాణి, డో.నెం. 10-13-493, రెడ్డి & రెడ్డి కాలనీ, విజయ డయాగ్నస్టిక్స్ సెంటర్ లేన్, తిరుపతి. ఫోన్ : 86886 63108.
AJT - 6101

DIABETES
REVA DIABETES CLINIC Best Diabetes Physician in Tirupati, Dr. Rekha Kattula, MBBS, DFM (RCGP, UK), F.Diab, (MSC Diabetes UK). 18-3-60/C4, Khadi Colony, TPT. Ph: 63016 32678
AJT - 179906

FLAT FOR SALE
తిరుపతి - కపిలతీర్థం దగ్గరలో అద్భుతమైన Hill View, East Facing గల 2BHK Flat (వెంటనే గృహ ప్రవేశం చేసుకునేల) అమ్మకానికి కలదు. No Brokers Pls 9666821667.
AJT - 10246

FOR SALE
తిరుపతి హౌసింగ్ బోర్డు కాలనీ, నంది సర్కిల్ టు అలిపిరి రోడ్డు, Opp. దివ్యారామం నూతనంగా నిర్మాణంలో లగ్జరీ 1730 చ.అ. 3BHK BJ అపార్ట్‌మెంట్ నందు ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ప్రావర్టీ ఇన్వెస్ట్‌మెంట్ పర్పస్ వారికి మంచి కమర్షియల్ రెంటల్ సదుపాయం మరియు 70% లోన్ సౌకర్యం కలదు. సెల్ : 73373 25053
AJT - 6061

WANTED
తిరుపతి లో పెట్రోల్ బంక్ నందు పని చేయుటకు M/F మరియు సర్వీస్ బాయ్స్, వాచ్ మెన్, స్వీపర్ కావలెను 79972 27259
AJT - 6086

WANTED
Pre-Primary Teachers (2), fluency of English is must. Watchman's (2) also: Cell No : 9966371716. Bhuvaneswari Vidyanikethan, Tiruchanur.
AJT - 6105

TO-LET
తిరుపతి భవాని నగర్‌లో ఓమ్ హాస్పిటల్ ఎదురుగా, 900 Sq.Ft. కమర్షియల్ బిల్డింగ్‌లో గ్రౌండ్ ఫ్లోర్ అద్దెకు ఇవ్వబడును. సెల్ : 94410 27986
AJT - 10294

TOLET
Tirupati, Near RTC Busstand, 3rd Floor 2 BHK (W/F, 11K) with Bike Parking for Employees Only. 86862 45800 / 86397 97470.
AJT - 6104

PLOTS FOR SALE
తిరుపతి, అన్నమయ్య సర్కిల్ నుండి 5 KM దూరంలో చిగురువాడలో లేఅవుట్ లో Ready to Construction, 40 feet CC రోడ్లు కలిగిన ప్లాట్లు అమ్మబడును. 1 Plot Cost 17,40,000 రూ. మాత్రమే. Contact : 9886975111.
AJT - 6065

DISTANCE EDUCATION
B.A., B.Com (Gen/Comp. Sci), B.Sc, Poly Diploma, B.Tech, M.Tech, MBA (ALL) కోర్సులందు Lateral Entry (Discontinue / Failed Students UGC గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా పై కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం. వివరములకు సం.ప్ర.: 82474 57565
AJT-6073

PLOTS FOR SALE
టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల పక్కన తిరుపతి ఐఐటీ దగ్గర అయోధ్య టౌన్ షిప్ నందు ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ ఓనర్ ఫోన్: 95027 74175 / 79959 92114
AJT- 6098

TUDA & RERA APPROVED FLATS
Ready to Occupy తిరుపతి లోని చెర్లోపల్లి జంక్షన్ వద్ద అద్భుతమైన మరియు విలాసవంతమైన 2BHK అపార్ట్మెంట్ ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. కేవలం 47 లక్షలకే మీ సొంత ఇంటి కల నెరవేరుతుంది సంప్ర:78423 35693, 88844 77553
AJT - 179913

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ పేమెంట్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 176960

FLATS FOR SALE
రెయిన్బో రెసిడెన్సీ శ్రీచైతన్య కాలేజ్ ఎదురుగా, పాడిపేట, తిరుపతి రూరల్ 2 Bhk, 1250 Sq.Ft (New Construction, READY to OCCUPY) తూర్పు /పడమర ఫేసింగ్ Flats అమ్మబడును Con : 98494 58804, 89199 50865.
AJT - 6085

CHANGE OF NAME
I, Orsu Srinivas (Old Name) R/o: 1/130, Chennayagari Palli, Nandalur, Annamayya Dt, A.P., do here by declared That, I have changed my name as ORSU SREENIVASULU (New Name) S/o Orsu Chinnaiah
AJT - 6106

CHANGE OF NAME
I, M. Geetanjali W/o Dr. Sravan Kumar Chenji R/o 19-9-18f/a, Lakshmi Puram, Tiruchanoor Road, Titupathi Town & District Ap Have Changed My Name To M.geethanjali
AJT - 6108

FLATS FOR RENT
3 BHK & 2BHK Flats Are Available For Rent In Karakambadi Road Tirupathi With Latest Aminities & Cupboards Car Parking 24 Hrs Water Facility Etc & as per Vasthu Cont : 98482 26551.
AJT - 1711

PLOT FOR SALE
తిరుపతికి దగ్గరగా తుడ ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ తక్కువ ధరకే అందుబాటులో కలవు సంప్రదించండి - 82470 75857, 94943 92069.
AJT - 6109

WANTED
తిరుపతిలోని మారుతి నెక్సా షో రూమ్ ఎదురుగా రేణిగుంట రోడ్ నందు శ్రీ లక్ష్మీ మోటార్స్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్ :9966225242
AJT-179567

FLAT FOR SALE
తిరుపతి, పోస్టల్ కాలనీ 5వ లైన్‌లో "జై రెసిడెన్సి" అపార్ట్‌మెంట్ నందు 3 వ ఫ్లోర్‌లో తూర్పు ముఖం గల 1860 Sft, 3 BHK, 4 Balcony లతో గల ఫ్లాట్ అమ్మకానికి కలదు. (Ready to occupy con: 98496 48496.
AJT - 10259

PLOTS FOR SALE
తిరుపతి - రేణిగుంట, తూకివాకం రోడ్డు, 27x60 (45అం.), 36x60 (60అం.), నార్త్, వెస్ట్ కార్నర్ ప్లాట్స్ 30 అ : రోడ్డుకు హౌస్ ప్లాట్స్ అమ్మబడును. సెల్ : 9110321531
AJT - 6063

WANTED
Wanted Accountant / Computer Assistant / Electrician. only Locally in and around Renigunta / Tirupathi Preferred. Please Contact : 91601 70001, 91601 70003, 9550818647
AJT - 179806

అమర్‌నాథ్ రైలుయాత్ర
జమ్ము, కాశ్మీర తేది.03-07-24. 11రోజులు టికెట్ 18 16,500/- మరియు అతదుపరి అమృతసర్, కురుక్షేత్రం, 5 శక్తిపీఠాలు 5 రోజులు టికెట్ 9,000/- సం.ప్ర. కె.వాసు, నెల్లూరు సెల్: 9491340504.
AJR-156686

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

కేఈసీలో న్యూజెన్ అడ్వైజరీ బోర్డు మీటింగ్

కుప్పం, ఫిబ్రవరి 17: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం న్యూజెన్ ఐఈడీసీ బోర్డు మీటింగ్ జరిగింది. కళాశాల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, ఆర్అండ్‌డీ డైరెక్టర్ కోదండరామయ్య, ప్రభుత్వ జిల్లా సైంటిస్ట్ నవీన్ వశిష్ఠ, ఈడీఐఐ ప్రొఫెసర్ ఎస్పీ సరీన్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు సాధించాల్సిన విజయాలు, అందుకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. బోర్డు సభ్యులు కళాశాలలో గల సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు జ్ఞాపికలను బహూకరించి అభినందించారు. హనీ వెల్ టెక్నాలజీస్ ట్రైనర్ చంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు అభివృద్ధి చేసిన డ్రోన్‌ను ప్రదర్శించారు.

టీడీపీతోనే మహిళాభ్యున్నతి

శాంతిపురం, ఫిబ్రవరి 17 : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారంటే అది కేవలం తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడేనని టీడీపీ నేత ప్రతాప్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్యామల అన్నారు. శనివారం మండలంలోని పలు బూత్‌లలో మహిళ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మఠం పంచాయతీలోని 3బూత్‌లకు, దండికుప్పం పంచాయతీలో 2బూత్‌లకు, అబకలదొడ్డి పంచాయతీలో 3బూత్‌లకు, కొలమడుగు పంచాయతీలోని ఒక బూత్‌కు కమిటీలను వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయంగా మహిళలు ఎదగాలని 30శాతం రిజర్వేషన్ తీసుకువచ్చి అత్యున్నత స్థానం కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎక్కడ చూసినా మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు. అలాంటి పార్టీకి మళ్లీ అవకాశం ఇస్తే రాష్ట్రంలో మహిళలు బతికే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి రూప, సరిత, మంజునాథ్, ధనంజయ, చినన్న, సుగుణమ్మ, గంట్లప్ప, విజయకుమార్, మునిరెడ్డి, అశోక్‌రెడ్డి, ఏకాంథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం కోసం టీడీపీని ఆదరించాలి

రామకుప్పం, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో మహిళా సంక్షేమం కోసం టీడీపీని ఆదరించాలని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు పద్మమ్మ, సీనియర్‌నేత అలివేలుమంగమ్మ కోరారు. శనివారం రామకుప్పం మండలం రాజుపేట, కొంగనపల్లెల్లో నిర్వహించిన మహిళా గృహసారథుల శిక్షణ కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాలతోపాటు మహిళలకు కూడా మోసం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించారన్నారు.ఆయా కార్యక్రమాల్లో నేతలు కొళ్ళపల్లెబాబు, కొళ్ళపల్లెవిజయ్‌కుమార్, తిరుపతమ్మ, నారాయణస్వామి, బాబు, జగపతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్‌కు బండపల్లె విద్యార్థి



శాంతిపురం, ఫిబ్రవరి 17: రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు సి.బండపల్లె విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జానకీరాం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలలో సి.బండపల్లె ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విష్ణు కన్వర్టింగ్ డంప్యాడ్ ఇంటూ ఎనర్జీ ప్లాంట్ ప్రయోగాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్‌కు ఎంపికయ్యాడని ఆయన తెలిపారు.

హంస వాహనంపై కాశీవిశ్వేశ్వరుడు



పలమనేరు,ఫిబ్రవరి17: పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అంకురార్పణ, కలశ స్థాపన, ధ్వజారోహణం, వాస్తుబలి, మృత్సంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి స్వామిని హంసవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. బొమ్మిదొడ్డిలోని సిద్ధేశ్వరస్వామి చేనేత శాలికులస్థుల సేవాసంఘం, డాక్టర్ జి.వి. హేమగిరి, శీర్ కరుణీకర్ సంఘం ఉభయదారులుగా వ్యవహరించారు.

రాజనాలబండ ఆలయానికి దూడ వితరణ



చౌడేపల్లె, ఫ్రిబవరి17:సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ఆలయానికి పెయ్యి దూడను భక్తులు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ నిర్వహకులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ..చౌడేపల్లెకు చెందిన కిశోర్ కుటుంబీకులు స్వామివారికి పెయ్యి దూడను విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆలయ నిర్వహకులు వారికి స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు.

చంద్రబాబుతోనే ముస్లిం అభివృద్ధి

గుడుపల్లె, ఫిబ్రవరి 17: చంద్రబాబు పాలనలోనే ముస్లింలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందారని కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం మైనార్టీ నాయకులతో కలిసి కొడతనపల్లెలో ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ ముస్లింలకు చేసిన మోసాన్ని వివరించారు. వైసీపీ పాలనలో ముస్లింలకు అన్ని విధాలుగా అన్యాయం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ముస్లింలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు అమీర్, నాయకులు సర్దార్, అన్సర్, మహబూబ్ బాషా, మునీర్, ముజీబ్, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మతు చేయాలని నిరసన

కల్లూరు, ఫిబ్రవరి 17: మరమ్మతుల పేరుతో తొలగించిన చేతిపంపు పరికరా లను తిరిగి అమర్చక పోవడంతో మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేసిన ఘటన కల్లూరు పంచాయతీ ఈరసానిపల్లిలో చోటుచేసుకుంది. నెలరోజులక్రితం చేతిపంపు మరమ్మతుకు గురికావడంతో ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా చేతిపంపు పరికరాలను మెకానిక్ వచ్చి తొలగించారు. నెలరోజులు కావస్తున్నా మరమ్మ తులు చేపట్టకపోవడంతో నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి వెంటనే చేతిపంపు మరమ్మతులు చేపట్టి అమర్చాలని మహిళలు డిమాండ్ చేశారు.

త్వరలో జడ్పీ అతిథి గృహం ప్రారంభం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి17: పుంగనూరు ట్రావెలర్స్ బంగ్లాలో నిర్మిస్తున్న జడ్పీ అతిథిగృహం త్వరలో ప్రారంభించనున్నట్లు జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ. 2కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో పుంగనూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఎంసీ ఛైర్మన్ అమరనాథరెడ్డి, కాంట్రాక్టర్ మురగప్ప తదితరులు పాల్గొన్నారు.

సందయ్యకుంట చెరువును కాపాడండి





చెరువును ఆక్రమించి మట్టి తోలిన రియల్టర్లు, గ్రామస్తుల నిరసన

పుంగనూరు, ఫిబ్రవరి17: నీరున్న చెరువును దౌర్జన్యంగా రియల్టర్లు మట్టితోలి ఆక్రమిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని, చెరువును కాపాడాలంటూ పుంగనూరు మండలం ఉలవలదిన్నె గ్రామస్తులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. పుంగనూరు సమీపంలోని ఉలవలదిన్నె వద్ద సందయ్యకుంట చెరువు నీటితో రైతులు వ్యవసాయం చేసుకుంటుండగా, మరోవైపు గ్రామస్తులు ఆవులు, గొర్రెలు, మేకలకు నీరు తాపిస్తూ జీవనం సాగిస్తున్నారు. మూడు రోజులుగా రియల్టర్లకు చెరువు ఆక్రమణపై కన్నుపడింది. పక్కనే వారు కొంత భూమిని కొనుగోలు చేసి ప్రహరీ నిర్మిస్తూ సందయ్యకుంట చెరువులో నీరున్నా ఏమాత్రం లెక్కచేయకుండా అక్రమంగా టిప్పర్లు ద్వారా మట్టిని భారీగా తరలించారు. చెరువును పూడ్చివేస్తూ చెరువును ప్లాట్లుగా ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేశారు. శనివారం కొందరు గ్రామస్తులు అడ్డుపడగా వారు ఈస్థలం తమదేనంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. భూమి ధర భారీగా పెరగడంతో రియల్టర్లు దర్జాగా ఎలాంటి అనుమతి లేకుండా పట్టపగలే అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అడిగేనాథుడే కరువయ్యారు. సంబంధిత ఉన్నతాధికారులు సందయ్యకుంట చెరువును ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని వారు కోరారు.

రొంపిచెర్ల ఎంపీడీవోగా రెడ్డెప్పఆచారి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 17: మండల ఎంపీడీవోగా రెడ్డెప్పఆచారిని నియమిస్తూ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈయన ఎంపీడీవోగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల వెన్ను విరిచిన ప్రభుత్వం

పలమనేరు తాలూకా జేఏసీ అధ్యక్షుడు ఆనందబాబు



ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఉద్దేశించి మాట్లాడుతున్న ఆనందబాబు

పలమనేరు, ఫిబ్రవరి17 : ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ వారి వెన్నువిరించిందని పలమనేరు తాలూకా జేఏసీ అధ్యక్షుడు ఆనందబాబు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు స్థానిక ఎన్జీఓ హోం వద్ద ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన రూ. 25,500 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసి, 12 వ పీఆర్సీ ప్రకటించాలని డిమాండు చేశారు. ఉద్యోగుల దాచుకొన్న ఏపీ జీఎల్ఐ, జీపీఎఫ్ సొమ్ములు కూడా తిరిగి చెల్లించడం లేదని వాపోయారు. జనరల్ సెక్రటరీ సీపీ ప్రకాష్ మాట్లాడుతూ సరండర్ లీవులు చెల్లించకపోవడం దారుణమన్నారు. యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ అప్రెంటిస్ విధానాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నం సరికాదన్నారు. హెల్త్ కార్డులు ఈ ప్రభుత్వ హయాంలో ఎందుకూ కొరగాకుండా పోయాయన్నారు. ఎస్టీయూ నాయకుడు విజయకుమార్ మాట్లాడుతూ ఒకటవ తేదీన జీతాలు, పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఎన్జీఓ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ స్పందన శూన్యమన్నారు. వాయిదాలు తప్ప ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎన్జీఓ సంఘం కార్యదర్శి జయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక యాప్‌లు పెట్టి ఏఎన్ఎంలను వేధిస్తోందన్నారు. పెన్షనర్ల సంఘం వెంకటకృష్ణ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తగ్గించి వేయడం దారుణమన్నారు. తిరిగి మంజూరు చేయాలని డిమాండు చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి మాటాడుతూ సచివాలయం ఉద్యోగుల సాధారణ ప్రభుత్వ ఉద్యోగులుగా చూడకుండా కొంత మంది అధికారులు అణచివేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు గ్రామ సచివాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ, పెన్షనర్ల సంఘ నాయకులు కృష్ణమూర్తి, సీపీఎస్ సంఘం కన్వీనర్ శశి, యాసిన్ షరీఫ్, మురళి, లక్ష్మీనారాయణ, నరసింహులు, నారాయణ, దేవ, పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొన్నారు.

రైతు బాగుపడాలంటే చంద్రబాబు రావాలి



రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కుప్పం, ఫిబ్రవరి 17: జగన్‌రెడ్డి పాలనలో అన్యాయానికి గురైన రైతులు మళ్లీ బాగుపడాలంటే తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం పూల మార్కెట్ వద్ద శనివారం టీడీపీ ఆధ్వర్యంలో రైతు చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు టీడీపీ హయాంలో అమలు చేసిన పలు పథకాలను వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిచిపోయాయని చెప్పారు. రైతు వ్యతిరేక విధానాలతో సాగుతున్న జగన్‌రెడ్డి పాలన అంతమైతే తప్ప రైతులకు మంచిరోజులు రావన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి, ప్రధాన కార్యదర్శి గోపాల్, రైతు సంఘాలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ విజయం తప్పదు

రాష్ట్ర భవిష్యత్తుకోసం టీడీపీ, జనసేన విజయం తప్పదని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో శనివార విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇచ్చి రాష్ట్ర ప్రజలు మోసపోయారన్నారు. ఇదే మాట ప్రతివొక్కరి నోళ్లలో వస్తున్నదన్నారు. సమర్థవంతుడైన నాయకుడు చంద్రబాబుకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికుల అవస్థలు
- టీడీపీ నిరసన





బస్సులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుప్పం ఆర్టీసీ బస్టాండు, కల్లూరులో ఆటోల కోసం వేచివున్న ప్రయాణికులు

కుప్పం, ఫిబ్రవరి 17: ముఖ్యమంత్రి జగన్ సభ కోసం కుప్పం ఆర్టీసీ డిపో నుంచి బస్సులు అనంతపురం జిల్లా రాప్తాడుకు తరలివెళ్లిపోయాయి. బస్సులన్నీ రాత్రికి రాత్రి వెళ్లిపోవడంతో శనివారం బస్టాండు చేరుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డిపోలో సుమారు 60 బస్సులుండగా, అందులో 40-50 బస్సులను సభకోసం తరలించేసిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఊరకుండిపోయారు. ఈ విషయం తెలియని ప్రయాణికులు శనివారం ప్రయాణాలు పెట్టుకుని బస్టాండుకొచ్చి బస్టాండు ఖాళీ ఉండడంతో గంటలకొద్దీ పడిగాపులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు చేరుకుని ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ ఎక్కడో దూరంలో జరిగే సభకు కుప్పం డిపోనుంచి ఏకంగా 50 బస్సులను అధికారులు తరలించేశారని, ఇది అన్యాయమని ధ్వజమెత్తారు. ప్రజలు, విద్యార్థులకు కనీసం ముందస్తు సమాచారం ఇచ్చివున్నా ఇంత సమస్య ఉండేది కాదన్నారు. అధికారులు ప్రయాణికుల వైపు ఆలోచించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, అది కూడా ఇక్కడ జరగలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు : రాప్తాడులో ఈనెల 18న ముఖ్యమంత్రి జగన్ నిర్వహించే సభకు ఆర్టీసీ అధికారులు పలమనేరు డిపోనుంచి 35కుపైగా బస్సులను తరలించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు రాని విషయం తెలియక వందలాది మంది ప్రయాణికులు బస్టాండులో పడిగాపులు పడ్డారు.

కల్లూరు : సీఎం జగన్ సభకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో ప్రయాణికుల శనివారం అవస్థలు పడ్డారు. కల్లూరు బస్టాండు కూడలిలో ప్రయాణికులు గంటలతరబడి ఎదురుచూసినా బస్సులు రాలేదు. దీంతో ప్రయాణికులు తమ గమ్యం చేరుకునేందుకు ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆర్టీసీ బస్సులన్నీ రాప్తాడుకు 'సిద్ధం'

- ఇబ్బందుల్లో ప్రయాణికులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 17: పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి 64 బస్సులు అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించే సిద్ధం మీటింగ్‌కు వెళ్లడంతో శనివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పుంగనూరు ఆర్టీసీ డిపోలో మొత్తం 78 బస్సులు ఉండగా అందులో సిద్ధం మీటింగ్‌కు 64 బస్సులు కేటాయించడంతో 14 బస్సు సర్వీసులు మాత్రం తిరుగుతున్నాయి. బస్సులు లేక ఆర్టీసీ బస్టాండ్ బోసిపోగా, పుంగనూరు నుంచి బయట ప్రాంతాలకు వెళ్లేందుకు, వచ్చేందుకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అలాగే పుంగనూరు మండలం, నియోజవర్గం నుంచి వైసీపీ శ్రేణులు, మహిళలు వెళ్లేందుకు కొన్ని బస్సులు కేటాయించగా బయట ప్రాంతాలకు బస్సులను పంపి ఆదివారం సిద్ధం సభ విజయవంతం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు పార్టీ శ్రేణులను ఆదేశించారు.



బస్సులు తరలించడంతో నిర్మానుష్యంగా ఉన్న పుంగనూరు బస్టాండ్

21న పుంగనూరు మండల సమావేశం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి17: ఈనెల 21న పుంగనూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో మండల సమస్యలు, అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి17: బైరెడ్డిపల్లె నుంచి పలమనేరు వెళ్లే ప్రధాన రహదారిలో కమ్మనపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బైరెడ్డిపల్లె నుంచి పలమనేరు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో కారు, ట్రాక్టర్ డ్రైవర్లు గోపి, శివాజి గాయపడినట్లు 108 సిబ్బంది తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

23న శేషాద్రి ఆలయంలో పౌర్ణమి వేడుకలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 17 : పట్టణంలో వున్న శేషాద్రిస్వామి ఆలయంలో ఈనెల 23వ తేది పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి విశేషపూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నాగభైరవస్వామికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఫ్రిబవరి17: పుదిపట్లలో వెలసిన నాగభైరవస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ నిర్వహకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు కూష్మాండ, పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

21నుంచి చాముండేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం

పుంగనూరురూరల్, ఫిబ్రవరి17: ఈనెల 21, 22వ తేదీల్లో పుంగనూరు తూర్పుమొగసాలలో వెలిసిన చాముండేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు జెట్టి కులస్తులు తెలిపారు. 21జూ స్వస్తివాచనం, గణపతి పూజ. 22న కృశారాధన, శాంతిహోమం, మహాపూర్ణాహుతి, పంచామృతాభిషేకం వైభవంగా జరుగునని పేర్కొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సింధు

పుంగనూరు, ఫిబ్రవరి17: సమస్యలు ఎదురైన సమయంలో ధైర్యంగా ఎదుర్కోవాలని పుంగనూరు న్యాయమూర్తి సింధు విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక లినార్డు ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు లక్ష్యం పెట్టుకుని బాగా చదవాలన్నారు. విద్యాహక్కు చట్టం, బాల్యవివాహాల నివారణ చట్టం, పోక్సో చట్టం తదితర వాటిపై అవగాహన కలిగివుండాలని వివరించారు. మన రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో న్యాయవాది వీరమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతి, వాణిశ్రీ, శ్రీరాములురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 17 : బైరెడ్డిపల్లె సమీపంలో శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తుండిన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ప్రభు అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి 144 మద్యం టెట్రాప్యాకెట్లు, మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 17 : వెంగంవారిపల్లెకు చెందిన టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు నారాయణప్ప మృతి పట్ల మాజీ మంత్రి అమరనాథరెడ్డి సంతాపం తెలిపారు. శనివారం ఆయన వెంగంవారిపల్లెలో నారాయణప్ప మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి తదితరులు మృతుడి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు కంటి పరీక్ష శిబిరం

కుప్పం, ఫిబ్రవరి 17: సాయిమాతా సేవాట్రస్టు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బెంగళూరు శంకర నేత్రాలయ సౌజన్యంతో కుప్పంలో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు జరిపి, అవసరమైన వారిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేస్తామన్నారు. వీరికి బెంగళూరులోని శంకర నేత్రాలయ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం



పలమనేరు, ఫిబ్రవరి 17 : పలమనేరు మండలం కరిడిమడుగు గ్రామ సచివాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే వెంకటేగౌడ రైతు భరోసా కేంద్రాన్ని, పాడి రైతుల కోసం నిర్మించిన జగనన్న పాలవెల్లువ కేంద్నాన్ని ప్రారంభించారు. అనంతరం కూర్మాయి సచివాలయం వద్ద రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు ఆర్వీఎస్ బోస్, చెంగారెడ్డి, జడ్పీటీసీ మల్లిక, ఎంపీపీ రేణు, బాలాజినాయుడు, విశ్వనాథరెడ్డి, మల్లీశ్వరరెడ్డి, ఎంపీడీఓ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొని వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను అందజేశారు.

నేడు మాతృభాషా పరిరక్షణ సదస్సు

పలమనేరు, ఫిబ్రవరి17 : మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో తెలుగుభాషా పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష కార్యదర్శులు పి. తులసినాథంనాయుడు, పుష్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో కవులు, రచయితలు, మాతృభాషాభిమానులు, పాల్గొంటారని, సదస్సులో పాల్గొనే కవులు, రచయితలను సన్మానిస్తున్నట్లు వారు తెలిపారు.

కొత్తపేట అభివృద్ధికి ప్రణాళికలు

కుప్పం, ఫిబ్రవరి 17: పట్టణ పరిధిలోని కొత్తపేట అభివృద్ధికి పలు ప్రణాళికలు రచిస్తున్నట్లు టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కొత్తపేట యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్‌లు తెలిపారు. కొత్తపేటలో శనివారం 5వ యూనిట్ పరిధిలోని 5 బూత్‌లకు సంబంధించి బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. కొత్తపేట సమస్యల పరిష్కారం కోసం ఫోరం ప్రతినిధులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకేశ్, మురళి, భరత్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

గన్నావారిపల్లెలో కలశ ప్రతిష్ఠ

సోమల,ఫిబ్రవరి17:సోమల పంచాయతీ గన్నావారిపల్లెలో శనివారం నూతన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పురోహితులు గణపతిపూజ, గంగపూజ, అంకురార్పణ,రక్షాబంధన్, వాస్తుహోమం నిర్వహించారు. ఆదివారం సుదర్శన హోమం, గ్రామోత్సవం, పుష్పశయ్యాదివాసం, జీర్ణ విగ్రహ స్థాపన, సోమవారం వ్యాసహోమం, శిఖర కలశస్థాపన, కుంభాభిషేకం, గోదర్శన, సీతారామస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దేవతా విగ్రహాల ఏర్పాటుకు రూ.70 వేల విరాళం



సోమల, ఫిబ్రవరి 17: పెద్దఉప్పరపల్లె పంచాయతీ సల్లాపురం వడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన సల్లాపురమ్మ ఆలయంలో దేవతా విగ్రహాల ఏర్పాటుకు ఎంపీ మిథున్‌రెడ్డి రూ.40వేలు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు సుధీర్ రెడ్డి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ గంగాధరం రాయల్, నాయకులు సురేంద్ర, మస్తాన్, అబ్రార్, ఇమ్రాన్, సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, ఈశ్వరయ్య, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

సదుం గురుకులం విద్యార్థి ప్రతిభ



సదుం, ఫిబ్రవరి 17: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎపిఫాని మెరిట్ టెస్టులో సదుం జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల 7వ తరగతి విద్యార్థి మిథున్ కుమార్ 2వ ర్యాంకు సాధించాడు. శనివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఉన్నతాధికారుల చేతుల మీదుగా మిథున్‌కుమార్ ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకున్నాడు. మిథున్ కుమార్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

తహసీల్దారుకు వీడ్కోలు



రామకుప్పం, ఫిబ్రవరి 17: రామకుప్పం తహసీల్దారు మురళీ పదోన్నతిపై ఇటీవల అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. శనివారం మండల సచివాలయంలో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయనను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబు, కో-కన్వీనర్ చంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్ పీఏ మురుగేష్, తహసీల్దారు శ్రీధర్, ఎంపీడీఓ రాధాకృష్ణ, డీటీ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఇళ్లత్తూరులో తాగునీటి సమస్య


వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

విజయపురం, ఫిబ్రవరి 17: మండలంలోని ఇళ్లత్తూరులో రెండు రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో పంచాయతీ బోరు నుంచి వచ్చేనీరు, రాజీవ్ టెక్నాలజీ పైలెట్ ప్రాజెక్టు నీరు రాకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీటికోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈవీఎంలపై అవగాహన


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్, అధికారులు

చిత్తూరు, ఫిబ్రవరి 17: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లో ఓటు వేసే విధానంపై ఓటర్లకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఈఆర్వో, కమిషనర్ అరుణ చెప్పారు. శనివారం చర్చివీధిలోని మార్కెట్ వద్ద ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానికంగా ఉన్న ఓటర్లకు ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈవీఎంలలో ఓటు ఎలా వేయాలో తెలియపరుస్తూ నమూనా పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హయాంలో ఎస్సీలకు ఒరిగిందేమీలేదు: డాక్టర్ థామస్


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి థామస్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 17: డిప్యూటీ సీఎం నారాయణస్వామి హయాంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఎస్సీలకు ఒరిగిందేమీ లేదని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ధ్వజమెత్తారు. మండలంలోని వెజ్జుపల్లె పంచాయతీలో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ, మన ఇంటికి మన డాక్టర్ థామస్ కార్యక్రమాల్లో భాగంగా టీడీపీ నేతలతో కలిసి థామస్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, నాగిరెడ్డి, దయారెడ్డి, భాస్కర్ రెడ్డి, బాలాజిరెడ్డి, స్వామిదాస్, దేవసుందరం, జ్యోతిరెడ్డి, పుష్పరాజ్, కామసాని కోదండరెడ్డి, జ్యోతియాదవ్, యాగమరెడ్డి, దేవరాజులు, గిరిబాబురెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గుండయ్య, మునిరాజులయాదవ్, కృష్ణారెడ్డి, నెల్లేపల్లె సుబ్రమణ్యం, అంజనేయులుశెట్టి పాల్గొన్నారు.

వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలి: భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి17: రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. నగరి మండల పరిధిలోని నంబాకం పంచాయతీలోని నంబాకం, నంబాకం దళితవాడ, చిన్నల్లూరు గ్రామాలలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా భానుప్రకాష్ ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటే రాజధానితో బాటు యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించే వారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అప్పులలో ప్రథమస్థానంలో ఉండేలా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంటరీ అధికారప్రతినిధి చినబాబు, నాయకులు బాలాజీ, జవహర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ తులసి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. శనివారం చిత్తూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికీ ఓటు లేని వారు వెంటనే ఓటు నమోదు చేసుకునేలా డ్వాక్రా మహిళలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. డీపీఎం వెంకటేష్, ఏపీఎం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు మనందరి బాధ్యత



మాట్లాడుతున్న హేమలత

కార్వేటినగరం, ఫిబ్రవరి 17: 18 సంవత్సరాలు నిండిన వయోజనులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ హేమలత పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటు హక్కు మనందరి బాధ్యత అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ నిస్వార్థ పాలకులను ఎన్నుకునేందుకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అధ్యాపకులు హరిబాబు, కార్తీక్, గోపీకృష్ణ, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

22నుంచి చాగంటి ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 17: కొంగారెడ్డిపల్లె ఆర్.కె. మోడల్ స్కూల్‌లో అరవింద సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 22, 23, 24వ తేదీల్లో ప్రతిరోజు సాయంత్రం రెండు గంటల పాటు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుచే సీతా యాశ్చరితమ్ మహత్ (సీతమ్మకథ) ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని వారు కోరారు.

నగరిలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17: నగరిలో నూతనంగా మోటారు వాహనాల తనిఖీ(ఎంవీఐ) కార్యాలయం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న పీఎస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరి నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం మండలాలతో సహా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాలతో కలిపి నగరిలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. అయితే ఆ కార్యాలయపు ఉద్యోగులు, సిబ్బంది, ఇతరత్రా వాటిని చూడాల్సిన బాధ్యతలను చిత్తూరు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆఫీసుకు అప్పగించారు.

డిప్యూటీ సీఎం వర్గం బైక్ ర్యాలీ

పెనుమూరు, ఫిబ్రవరి 17: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అనుకూల వర్గ వైసీపీ నాయకులు సిద్ధం పేరుతో శనివారం పెనుమూరు క్రాస్ నుంచి పెనుమూరు మీదుగా చిప్పారపల్లి వరకు ఆ పార్టీ నేత విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. యశోదారెడ్డి, గిరిధర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, యతీశ్వర్ నాయుడు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యూత్ ఆధ్వర్యంలో...

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 17: మండలంలోని వైసీపీ యూత్ ఆధ్వర్యంలో సిద్ధం కార్యక్రమంలో భాగంగా కొండేపల్లె, వింజం, వరత్తూరు, తూగుండ్రం, అంబోధరపల్లె, ఆత్మకూరు, ముక్కళత్తూరు, గంగాధరనెల్లూరు పంచాయతీల్లో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు చిన్నమరెడ్డి, గుణారెడ్డి, హరిబాబు, పట్టాభిరెడ్డి, వేలు మొదలి, ఏకాంబరం, వెంకటరెడ్డి, రూప్‌కుమార్‌రెడ్డి, ఢిల్లీ, జగన్, మోసెస్‌లు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం, ఫిబ్రవరి 17: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయం వద్ద నిర్వహించడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ కోరారు.

అన్న క్యాంటీన్‌లో...

పూతలపట్టు, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్ వద్ద శనివారం కొంగరలింగన్నగారిపల్లె గ్రామానికి చెందిన చిన్నబ్బ నాయుడు, వసంతమ్మ దంపతులు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊట్ల నాగరాజులు నాయుడు, ఏకాంబరం, రజనీ, వీరభద్రయ్య, భాస్కర్, లోకనాథం నాయుడు, బాలాజీ, దాము తదితరులు పాల్గొన్నారు.

21, 24 తేదీల్లో కల్యాణోత్సవాలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 17: స్థానిక కోదండరామాలయంలో పలువురు భక్తుల ఉభయంతో ఈనెల 21, 24వ తేదీల్లో స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాఘమాసం సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి స్వామివారికి కల్యాణోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. కల్యాణోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఉత్సవ అక్షింతలు, తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు అందించనున్నట్లు తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

పాలసముద్రం, ఫిబ్రవరి 17: మండలంలోని సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాలసముద్రం, శ్రీకావేరిరాజుపురం సచివాలయాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, సచివాలయంలో పని చేసే అన్ని శాఖల సిబ్బంది పనివేళల్లో కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

పెనుమూరు, ఫిబ్రవరి 17: పెనుమూరు ముత్యాలమ్మ ఆలయం వద్ద చెన్నైలోని శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ మొత్తం 65మందికి వైద్య పరీక్షలు చేశామని, వారిలో 20మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి చెన్నైలోని శంకర నేత్రాలయ సౌజన్యంతో ఉచితంగా కంటి ఆపరేషన్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 17: బైరెడ్డిపల్లె సమీపంలో శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తుండిన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ప్రభు అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి 144 మద్యం టెట్రాప్యాకెట్లు, మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చంద్రబాబుతోనే ముస్లింల అభివృద్ధి

గుడుపల్లె, ఫిబ్రవరి 17: చంద్రబాబు పాలనలోనే ముస్లింలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందారని కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం మైనార్టీ నాయకులతో కలిసి కొడతనపల్లెలో ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ ముస్లింలకు చేసిన మోసాన్ని వివరించారు.

ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికులకు ఇబ్బందులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17: అనంతపురం జిల్లాలో సీఎం జగన్ సభకు చిత్తూరు నుంచి కూడా ఆర్టీసీ బస్సులను తరలించారు. దాంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చిత్తూరు నుంచి పక్కనే ఉన్న గుడిపాల, జీడీనెల్లూరు మండలాలకు వెళ్లేందుకు కూడా బస్సుల్లేక ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. పలమనేరు, పుంగనూరు, పుత్తూరు, నగరి వంటి ప్రాంతాలకు వెళ్లేవారు లారీలు, టెంపో వ్యాన్లలో ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరుకోవాల్సి వచ్చిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పాలసముద్రం: చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలో నడిచే మూడు ఆర్టీసీ బస్సుల్లో రెండింటినీ అనంతపురం జిల్లాలోని రాప్తాడులో జరిగిన సీఎం జగన్ బహిరంగసభకు తరలించడంతో శనివారం ఈమార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు బస్సుల్లేకపోవడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకున్నారు. బస్సుల్లేకపోవడంతో ఆటోవాలాలు రెట్టింపు చార్జీలు వసూలు చేశారు. సీఎం సభల పేరుతో ఆర్టీసీ సర్వీసులను రద్దుపరచడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోగులకు ఇక్కడ 'పరీక్షే'!

- దోచుకుంటున్న ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్

పూతలపట్టు, ఫిబ్రవరి 17: చిత్తూరు, తిరుపతి జాతీయ రహదారిలోని పి.కొత్తకోట గ్రామం వద్ద సామాజిక ఆరోగ్యకేంద్రం ఉంది. ఇక్కడికి నిత్యం రోజుకు 200 మందికి పైగా రోగులు వస్తుంటారు. సోమ, బుధవారాల్లో రోగుల సంఖ్య 250కి పైమాటే. కానీ ఇక్కడ వైద్యాధికారులు, వైద్యసిబ్బంది తీరుతో రోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రోగులకు వసతుల విషయాన్ని పక్కన పెడితే ఈ సామాజిక కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి భర్త ఆస్పత్రికి ఆమడ దూరంలో ప్రైవేటు ల్యాబ్‌ను నిర్వహిస్తున్నాడు. ఆస్పత్రికి వెళ్లే రోగులకు వైద్యాధికారులు పలు రకాల పరీక్షలకోసం ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లమని రెఫర్ చేస్తున్నారు. ఇదేమిటి.. ఇది ప్రభుత్వాస్పత్రి కదా.. ఇక్కడ పరీక్షలు నిర్వహించరా అని ఎవరైనా ప్రశ్నిస్తే.. ఇక్కడ కొన్ని పరీక్షలు మాత్రమే చేయగలము.. మిగిలినవి ఫలానా చోట చేసుకుని రండి అని ఉచిత సలహాలిచ్చి పంపుతున్నారు. అక్కడికి వెళితే చిన్నపాటి పరీక్షకు కూడా వందల రూపాయలు వసూలు చేస్తున్నారని రోగులు బహిరంగంగా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇక్కడ వినియోగించే 104 వాహనం తుప్పు పట్టి పోయింది. దీంతో ఆ వాహనాన్ని ఆస్పత్రి ప్రాంగణంలోనే ఓ మూలన పడేశారు.



పి.కొత్తకోట సామాజిక ఆరోగ్యకేంద్రం


మూలనపడ్డ 104 వాహనం

ఉద్యోగులను వేధిస్తే తిరుగుబాటు తప్పదు: జేఏసీ

- 30శాతం ఐఆర్‌తో బాటు ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాల్సిందే



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

నగరి, ఫిబ్రవరి 17: ఉద్యోగులను వేధిస్తే తిరుగుబాటు తప్పదని జేఏసీ నాయకులు శనివారం పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ తక్షణమే చెల్లించాలని, నూతన పీఆర్సీని అమలుచేయాలని, పీఆర్సీ అమలయ్యే వరకు 30శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని ఏపీ జేఏసీ నగరి తాలూకా చైర్మన్ ప్రభాకర్ వర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, ఏపీటీఎఫ్ నాయకులు నరేంద్ర, స్కూల్‌అసిస్టెంట్ సంఘ నాయకులు సురేష్‌బాబు డిమాండ్ చేశారు. నాడు అధికారంలోకి వచ్చిన వారంలోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పి నేటి వరకు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత ఏడాది జూలై నుంచి నూతన పీఆర్సీని అమలు చేయాల్సి వున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వారు విమర్శించారు. పరిస్థితి ఇలాగే వుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఫిబ్రవరి 27న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇదెక్కడి న్యాయం స్వామీ: టీడీపీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17: పేదలకు దుస్తులు ఇచ్చే కార్యక్రమాన్ని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ చేపడితే దాన్ని పోలీసుల ద్వారా అడ్డుకోవడం విడ్డూరమని వెదురుకుప్పం మండల పార్టీ బూత్ కన్వీనర్ అనిల్ విమర్శించారు. శనివారం వెదురుకుప్పం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగాధరనెల్లూరు మండలం వెజ్జుపల్లిలో టీడీపీ నేత థామస్ పేదలకు దుస్తులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడితే పోలీసులతో అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో పేద ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేని చేస్తే డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేదలకు వితరణగా ఏమీ ఇవ్వలేదన్నారు. డాక్టర్ థామస్ పేదలందరికీ దుస్తులు ఇవ్వాలనే దృక్పథంతో నెల రోజుల క్రితం నుంచి చేపట్టిన కార్యక్రమాన్ని పోలీసులతో అడ్డుకోవడం బాధాకరమన్నారు. టీడీపీ నేతలపై నారాయణస్వామి అవాకులు చవాకులు పేలడం మానుకోవాలని హితవు పలికారు. మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల భక్తి భావాలను దెబ్బతీసిన మంత్రి రోజా

- గాలి భానుప్రకాష్



నగరి, ఫిబ్రవరి 17: నగరి ప్రజల భక్తి భావాలను దెబ్బతీసేవిధంగా మంత్రి రోజా నడుచుకుంటున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ విమర్శించారు. నగరి టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరి ప్రజలకు, చుట్టుపక్కల వారికి దేశమ్మ దేవాలయం గర్వించదగ్గ దేవాలయమని చెప్పారు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పూర్తి కాని గుడికి కుంభాభిషేకం చేయడం, నవగ్రహ విగ్రహాల ఏర్పాటులో ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా సూర్య, చంద్రులను తూర్పుదిక్కు చూసేటట్లు అమర్చడం దారుణమన్నారు. హడావుడిగా ప్రారంభోత్సవాలు చేయడంతోనే నవగ్రహాల మార్పు జరిగిందని చెప్పారు. ఎన్నికలలో గెలుస్తామో లేదోనన్న భయంతో ప్రారంభోత్సవం చేసి ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా ప్రవర్తించడం విచారకరమన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు కృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, చిత్తూరు పార్లమెంటరీ టీఎన్‌టీయూసీ అధికారప్రతినిధి జ్యోతి నాయుడు, పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు ధనంజయయాదవ్, మాణిక్యవాసన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

టీడీపీ సానుభూతిపరులైన నగరి మండలం ముడిపల్లి దళితవాడకు చెందిన గోవిందస్వామి సోదరుడు మురుగేషన్, నగరి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన శీనురాజ్ అత్త మోహన మ్మాళ్, రాసప్పకాలనీలో మహమ్మద్‌సేట్ తండ్రి బల్కిష్‌బీ భౌతికకాయానికి శనివారం గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బాలాజీ, గోవిందస్వామి, నాగరాజు, వీకేఎస్‌వాసు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 17: చిత్తూరు ప్రభుత్వాస్పత్రి, అపోలో ద్వారా చిత్తూరు నగర ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రి, అపోలో అధికారులను కోరారు. శనివారం సొసైటీ సభ్యులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రి, అపోలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అపోలో హెడ్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే న్యూరాలజీ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే డయాలసిస్‌కు మరో ఐదు బెడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో సూపరింటెండెంట్ సుధాకర్, సొసైటీ సభ్యులు తాండవ మూర్తి, శివకుమార్, సత్య, శోభారాణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువపై శిక్షణ

పెనుమూరు, ఫిబ్రవరి 17: జగనన్న పాలవెల్లువలో భాగంగా మండలంలోని 30 పాల కేంద్రాలకు సంబంధించిన మెంటార్, రూట్ ఆఫీసర్, సెక్రటరీ, అసిస్టెంట్ సెక్రటరీలకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ బ్రహ్మానందరెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలవెల్లువ కార్యక్రమాన్ని ఈ నెల 21 నుంచి ప్రారంభించాలని, ఇందుకు సంబంధించిన విధి విధానాలపై క్లుప్తంగా వివరించారు. అమూల్ సంస్థ మిగిలిన వారికంటే రైతులకు లీటరు పాలపై రూ.5 వరకు అదనంగా ఇచ్చేందుకు ముందుకొచ్చిందని, ఈ విషయాన్ని రైతులకు వివరించి పాల సేకరణ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పాలవెల్లువ జిల్లా కోఆర్డినేటర్ నవీన్, ఏపీవో మీనాకుమారి, ఏపీఎం హరికృష్ణ, అమూల్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం ఎంపీడీవోగా మోహన్‌మురళి బాధ్యతల స్వీకరణ

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 17: ఎస్ఆర్‌పురం ఎంపీడీవోగా మోహన్‌మురళి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నిర్మాణానికి నాలుగేళ్లు.. ప్రారంభానికి ఎన్నేళ్లో..?

- నిరుపయోగంగా పెనుమూరు బస్టాండు కాంప్లెక్స్


నూతనంగా నిర్మించిన బస్టాండులో ఆటోలు, ఫ్లెక్సీలు ఉంచిన దృశ్యం

పెనుమూరు, ఫిబ్రవరి 17: 'ఇక్కడ నూతన బస్టాండు నిర్మించాలి.. అందరూ వారం రోజుల్లో ఖాళీ చేయండి.. లేదంటే పంచాయతీ వాళ్లు తొలగిస్తారు' అని నాలుగేళ్ల క్రితం పెనుమూరు బస్టాండులో దుకాణదారులతో అధికారులు చెప్పిన మాటలు. అప్పుడు దాదాపు 30 మంది చిన్న చిన్న దుకాణాలను నిర్వహిస్తూ జీవనం సాగించేవారు. ఇలా ఖాళీ చేయండి అనడంతో వారు తమకు జీవనోపాధి లేకుండా పోతుందని అధికారులను ప్రశ్నిస్తే, బస్టాండు వెనుకవైపు ఉన్న రాములవారి భూమిలో తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో వారిలో కొందరు ఆ స్థలంలో తాత్కాలిక షెడ్లు వేసుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు నూతన బస్టాండు కాంప్లెక్స్ నిర్మించాక వాటిలో పెట్టుకుందామని ఆగిపోయారు. 2020 జనవరి 24వ తేదీన నూతన బస్టాండు కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ నిధులు షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.84 లక్షలు, మండల పరిషత్ గ్రాంట్‌లో రూ.15 లక్షలు, సిమెంటు రోడ్డుకు జిల్లా పరిషత్ గ్రాంట్ రూ.24 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. అయితే ఏడాదిలో పూర్తయ్యే ఈ బస్టాండు కాంప్లెక్స్ నిర్మాణాన్ని నాలుగేళ్ల పాటు సాగదీశారు. ఎట్టకేలకు నేటికీ చిన్న చిన్న పనులు మినహా నిర్మాణం మొత్తం పూర్తయ్యింది. అయితే ప్రారంభోత్సవం మాత్రం జరగలేదు. దీంతో బస్సులు నిలిచేందుకు స్థలం మరెక్కడా లేకపోవడంతో బస్టాండులోకి వస్తున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్ మాత్రం నిరుపయోగంగా ఉంది. ఇప్పుడు అది ఫ్లెక్సీల ఏర్పాటుకు అడ్డాగా మారింది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ కోడ్ కూడా విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వీటిని ప్రారంభిస్తారా లేక వైసీపీ వర్గపోరుతో అలానే వదిలేస్తారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు పలువురి ఎంపిక


హేమశ్రీకి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న డీఈవో

చిత్తూరు, ఫిబ్రవరి 17: పీఈఎస్ పాఠశాలలో గత మూడు రోజులుగా జరిగిన ఇన్‌స్పైర్ మనక్ జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో దేవిబాలమందిర్‌కు చెందిన విద్యార్థిని హేమశ్రీ ఉత్తమప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం ఎంపికైన విద్యార్థిని హేమశ్రీని డీఈవో దేవరాజులు, ఏడీ విజయేంద్రరావులు అభినందించి ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, హెచ్ఎం సుజాత, గైడ్ టీచర్ జయభారతి తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థిని గాయత్రి

వెదురుకుప్పం: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని కె. గాయత్రి ఎంపికైనట్లు శనివారం ఆ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. గైడ్ టీచర్ జ్యోత్స్న, విద్యార్థిని గాయత్రిని అభినందించారు.

ఐరాల: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఐరాల మండలానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల చిత్తూరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కాణిపాకం జడ్పీ హైస్కూల్ నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న హర్షవర్ధన్, పొలకల జడ్పీహైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న తోరణ్‌కుమార్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవోలు రుష్యేంద్రబాబు, దామోదర్ నాయుడు తెలిపారు.


ఎంపికైన విద్యార్థులు తోరణ్‌కుమార్, హర్షవర్ధన్

మూలనపడ్డ చెత్తసేకరణ ఆటోలు


నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ ఆటోలు

గుడిపాల, ఫిబ్రవరి 17: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చెత్త సేకరణ ఆటోలను రూ.వేలకోట్లు వెచ్చించి పంపిణీ చేస్తే.. అవి చివరకు మూలనపడే స్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చెత్త సేకరణ కోసం ఆటోలను కొనుగోలు చేసి మండలాలకు కేటాయిస్తే... అవి క్షేత్రస్థాయిలో వినియోగానికి నోచుకోక వృథాగా పడి ఉన్నాయని మండల ప్రజలు అంటున్నారు. చెత్తసేకరణ ఆటోలు ఎండకు ఎండుతూ, వానలకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

హంస వాహనంపై దర్శనమిచ్చిన కాశీవిశ్వేశ్వరుడు

పలమనేరు, ఫిబ్రవరి 17: పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు, అంకురార్పణ, కలశ స్థాపన, ధ్వజారోహణం, వాస్తుబలి, మృత్స్యంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి స్వామిని హంసవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. బొమ్మిదొడ్డిలోని సిద్ధేశ్వరస్వామి చేనేత శాలికులస్థుల సేవాసంఘం, డాక్టర్ జి.వి. హేమగిరి, శీర్ కరుణీకర్ సంఘం ఉభయదారులుగా వ్యవహరించారు.